"గొప్పోళ్ళ మద్దెన" తన కడుపు కాలిపోతున్నా ఏడవ కూడ దని ఆమెకు తెలుసు. సభ్యతకు భంగం రాకుండా, తనో తల్లిననీ, తనకు మిగిలిన ఒక్క కొడుకూ చచ్చిపోయేడనీ, సాధ్యపడక పోయినా మర్చిపోడాని కామె అణువణువునా ప్రయత్నిస్తోంది.

కదలిపోయిన ఫోటోలా వుందామె ముఖం. ఏ ఫీచరూ స్పష్టంగా లేదు. ఆమె శరీరమంతా లోతుగా కోసుకుపోయినట్టు ముడతలుపడి, వేసవిలో ఎండి పగిలిన చెరువు గర్భంలావుంది. రెక్కలు కాలిన దీపప్పురుగులా అతి అసహ్యంగానూ, అతి దీనం గానూ వుందామె. తనకు అనుక్షణం కన్పిస్తున్న భయంకర చిత్రాన్నేదో చూడదల్చుకోలేనట్టు క్షణక్షణం మాత్రం కనురెప్పలు మూసుకుంటోందామె.

యశోదా, సిరాజ్‌లే పలుకరింపులూ, సానుభూతి వచనాలూ కావిస్తున్నారు. వాళ్ళ ప్రశ్నలకి మనిషో జవాబు చొప్పున చెప్తు న్నారు వరండాలో వాళ్ళు. బూతులు మినహాయిస్తే వాళ్ళు చెప్పిన కథ!

బండతన్ది అక్కడికి దగ్గరేవున్న ఒకపల్లెట. బండే వాడి యావదాస్తీనట. అతనికంటే ముందుపుట్టిన "పంచిపాండవుల్లా టోళ్ళలో నలుగురు సిన్నప్పుడే సెల్లిపోనారు. కడకీడొక్కడే దరమరాజులాటోడు– మిగిలినాడు' అతని తండ్రిపోయి "మొన్న చివర్రేత్తిరికి ఏడో ఏట సొరబడ్డది" ఆ బండతనికి ముత్తేలమ్మ

"అంటే ఓళనుకున్నావ్?"

"ఆడి మావఁ కూతురు"

"నూర్నెంబరు పంచినాగుంటాది గుంట"

"అచ్చంగా తను సినిమాల సావిత్తిరేననుకుం టాంది"

అంటే మనసైందట, ఆ గుంటకి ఈ ముసిల్దంటే ఒళ్ళు మంటట ఈ ముసిల్దానికి రెండు కళ్లూ పువ్వులేసి పోయే "ఏటన్నేయం ఐపోద్దో ఏటోనని సీముండా! మా యమ్మున్న న్నాళ్లూ నా కగపడక అని తగిలేని, ఈ రెక్కల్లేసి పచ్చిని గూట్లో ఎట్టుకుని ఆ సీరామ చంద్రుడు" కాలం వెళ్ళపుచ్చుతున్నాట్ట. ఇప్పుడీ ముసిల్దానికి రోజుగోరి తోటనో పాడ్నుయ్యే గతి. ఈ ముండకి యిన్ని గంజినీళ్లోసే వోళ్లెవరూ నేరు. సస్తే కాటికి కాళ్ళెట్టు కీడిసేసే వాళ్ళుకూ ఆడా నేరు"

"మరిప్పుడీ ముసల్దేమౌతుంది?" ఆదుర్దాగా అడిగేడు సిరాజ్.

ఎవరూ మాటాళ్ళేదు. వాళ్ళనింకా అదిమి పట్టు కుంటున్నట్టు చీకటి కదిలింది. ఈలోగా చివర్ని కూర్చున్న కుర్రాడొకడు ముందుకొచ్చేడు. ఆత్మ విశ్వాసంతో నురగలు కక్కుతున్న పందెపు గుర్రంలా, ఎక్కుపెట్టిన బాణంలా వున్నాడు. తనా, పరా తెలియని యవ్వనంలో వున్నాడు. "మా వన్తా సచ్చిపోనావా దొరా" అని సిరాజ్‌తో అని, "నెగే, ముసల్దానా! నా నుండగా నీ కొచ్చిన బయవేఁన్నేదు" అని ముసల్దానితో అని ఆమెని లేవదీసేడు.

దూరంగా ఒక మెరుపు మెరిసింది

చీకటి చీలింది.

(ఓ రోజూ ఆస్పత్రిలో ఒకే ఒక అతిమంచి సూదిమందు వుంది. బజార్లో అది స్టాకులోలేదు. అదివ్వకపోతే ఓ గొప్ప పేషెంటు చస్తాడు. అదివ్వకపోతే వో పేద పేషెంటూ చస్తాడు. ఆ యిద్దరిలోనూ ఆ మందు ఎవరికివ్వాలి? ఎవరికిస్తారు? అందువల్ల ఫలితాలేవింటి? కథ రాయొచ్చు" అని శ్రీ రాచకొండ విశ్వనాధశాస్త్రిగారు చేసిన సూచన ఆధారంగా....)

**(జయశ్రీ, 1.6.1966)**

# జ్యోతిషం

**దే**శాన్ని పట్టుకున్న ముసురు పదిరోజులై వదల్లేదు. నాలాంటి తిరుగుడుద్యోగం వాళ్ళూ, ప్రాణం మీదకొచ్చిన వాళ్ళూ తప్ప, ఎవరూ ప్రయాణాలే చేస్తున్నట్టు లేదు ఈ ముసురువల్ల. అంచేత ఈ ఆల్‌థర్డు రైల్లో కూడా నాకంపార్టు మెంటులో నేను కాక మరో యిద్దరే వున్నారు. ఒకడుతంపిలో కుక్కలా ముడుచుకొని పడుకున్నాడు. రెండో ఆయన పెద్ద దేశభక్తుళ్ళా పదో నెంబరు గుడ్డలు వేసుకున్నాడు. అతని చేతి సంచినిండా కోర్టు రికార్డుంది. అతని కళ్ళనిండా దగావుంది. అతని తలమీద యెన్ని వెంట్రు కలున్నాయో, తల్లో అన్ని పేచీలున్న లిటిగేషను మనిషిలా వున్నాడు. అంచేత, అతన్తో మాట్లాడాలనిపించక, పొగమంచు ఫోటోలా కిటికీలోంచి కనిపిస్తున్న దృశ్యాన్ని చూస్తూ కూర్చున్నాను.

ఈలోగా, ఎవరో రైతుల్లా వున్నారు– ఒక మగా, ఒక ఆడా మా పెట్టె ఎక్కి తడిసిన బట్టలు పిడుచు కుంటూ తలుపు దగ్గరే నిలబడ్డారు. ఆ ఆడమనిషే బలంగా, ఎత్తుగా, లావుగా, కర్క శంగా, ఏ మంత్రాల మర్రినుంచో సరాసరి నడిచొచ్చేసిన

బ్రహ్మరాక్షసిలా వుంది. పంచెకట్టి, మీసాలు పెట్టి, గద చేతికిస్తే, అచ్చా దుర్యోధనుళ్ళా వుంటుంది. ఆ మొగాడు మాత్రం, ప్రతి క్షణం పాండవుల పార్టీలో చేరిపోదామనుకునే కురు సైన్యంలోని అరటిక్కట్టు సైనికుళ్ళా వున్నాడు.

"ఏవోఁయ్! పండుక్కిముందే అత్తారింటి కెళ్ళేవేఁవిఁటి?" అంటూ దేశభక్తుడు అతన్ని పలకరించేడు.

"అయ్యో! నువ్వా కరణం బావ్! నాను సూడేనేదు" అంటూ ఆ ఆడమనిషి కరణం వేపు కాళ్ళ బురదైనా తుడుచుకోకుండా వెళ్ళింది. ఆమె వెనకాలే నడిచేడు కౌరవ క్వింజ్లింగ్.

"ఏం రాజమ్మా! మొగుణ్ని పుట్టింటికి లాక్కెళ్ళి నట్టున్నావ్?" అని కరణవేఁ మళ్ళా పలకరించేడు. "నువ్వోళ్ళోనేవుగాని కరణం బావ్...." ఏదో అన బోయేడు రాజమ్మ భర్త.

నువ్వవలకుండు నన్జెప్పనీ" అని మొగుడినోరు నొక్కేసింది రాజమ్మ. తర్వాత గొంతు సవరించుకొని స్పీచికి తగులుకుంది.

"నువ్వోళ్ళో నేవుగాని కరణం బావ్! నాకు బగ మంతుడు గొప్పన్నాయం సేసేబోను. ఏటైందో ఎరికా? మొన్న శనోరం పొద్దు, అర్ధ మద్దెంతరంగా మా అయ్య కవురెట్టినాడు, మా తమ్ముడికి ముంచుకొచ్చినాదని. మా తమ్ముడంటే ఓలను కున్నావ్? మా యమ్మి నిచ్చు కున్నానే, ఆడు.

బైలెల్లినా వఁన్నమాటే గాని, మాంతోవలో నుండగానే, మా యమ్మి కేటన్నాయం ఐపోద్దో ఏటోనని, బెద్దిరిల్లిపోయేనంటే నమ్ము. ఎదవరైలు మూడు గంటలు నేటాయేల. మాం గామం సేరేసరికి పొద్దోయింది.

మాఁ వెళ్ళేసరికి, అంతా కోజయిపోనానికి సిద్దంగుంది. బయటొడీసినారు మా తమ్ముడ్ని. మడిసి మూ డొంకర్లుపోనాడు. మతి మన్లో లేనేలేదు. ఆడి కాళ్ళకాడ రెక్కలిరిగిన పచ్చినా కూకుండిపోనాది నా కూతురు.

అప్పుడు మాయమ్మిన్జూసేసరికి, దుఃఖం ఎలా గొచ్చినా దంటే- సంద్రంలో కెరటాలు నెగుస్తయే- అలా నెగిసింది. గుండెల్లో అగ్గి రాజేసినట్టయి పోనాదంటే నమ్ము. అలాటప్పు డెంతేడి సేటి నాబం సెప్పు.

అంచేత, బండిమీద మా తమ్ముణ్నొడీసుకొని, మా వూరు పెద్దటాట్రు నేడూ- దరమారావు బాబు- ఆరికాడికెళ్ళి, ఆరికాళ్ళ మీద పడిపోయి, 'బావ్! ఆపరేసనే సేస్తావో, యిండీసనే సేస్తావో, సెయి. కాన్నా తమ్ముణ్ణి మాత్తరం బతికించు అని బతిమిలాడి నాను. డాట్రు బాబు కూడా రేత్తిరేగినంతకీ అవస్త పడినాడు. కాని అతగోడికీ అంతుబట్టనేదు మనోడి జబ్బు. ఇక యీ వొయిద్దెం నాబంనేదనిపించినాది మలికోడి కూసేసరికి.

అంచాత, పొద్దు పొడిసేసరికి బైలెల్లినాను, మాయమ్మిన్దీసు కొని. ఎక్కడి కనుకున్నావ్? ఊరవతల మటం ఎట్టినాడే- బైరాగి చాత్తుర్లు- ఆరికాడికి. మాం జేరబోయీ సరికా బాబుతాన్న వాఁడి, పూజలో కూకున్నాడు. ఆరికాళ్ళ మీద మా యమ్మినొడేసి, దాని మొగుడ్ని బతికించమని బతిమిలాడ్నాను. అప్పు డా బాబేటి సేసినాడో ఎరికా? మా యమ్మిని సెయ్యి సాపమన్నాడు. మా యమ్మి జూపింది. సెయ్యి పరీచ్చగా సూసి, నీ మొగుడి కేం బయవేఁ? మరో పాతికెకరాలు కొంటేగాని జావడే. నెగు నెగు. నువ్వింటి కెల్ల బొయ్యా సరికి నెగిసి కూకుంటాడు సూడన్నాడు. అచ్చంగా ఆ బాబు సెప్పినట్టే ఐందంటే నమ్ము. మావెఁళ్ళ బోయీ సరికి మా తమ్ముడు నెగిసి కూకున్నాడు.

నీకు తెల్దుగాని కరణం బావ్! చాత్తుర్లు బావ్ సెయిజూసి, శాత్రం సెప్పినాడంటే, యిస్పేమిత్తురుడి సేపానికేనా తిరుగుం టదేటో గాని, ఆరి మాటకి తిరుగుండదంటే నమ్ము. ముందటేడో పాలి ఏటైందో ఎరికా? శాత్తుర్లు బావ్ నాతో "మీ నాయుడుకి పావు కరుస్త దేటోనే" అన్నాడు. అన్నాడో నేదో గాని బారెడు జెర్రిపోతొచ్చి పొడిసినా దా మూడోనాడు.

ఔను గాని బావ్! నా ఐకోరటు దావా ఏటౌద్దో ఏటో, ఓ పాలడుగుతా వేటి? నా నీసుకెల్తాలే నిన్ను."

అని ఆ మనిషాగే సరికి, రైలు ఆగినట్టయింది. తీరాచూస్తే నిజంగానే రైలాగింది. ఆ మనిషీ, ఆవిడ మొగుడూ, కరణం దిగిపోయేరు. ఆ మనిషికి జ్యోతిష్యంలో వున్న మూఢనమ్మకం చూస్తే, నేను చాల్నాళ్ళ క్రిందట చూసిన అచ్చంగా అలాంటి మనిషే గుర్తుకొచ్చేడు.

అదంతా జరిగి ఏ పదిహేనేళ్ళో అయింది. ఆ రోజుల్లో మా మేనమాఁవఁ విశ్వనాథం బతికుండేవాడు. అతనికి పాతీ కెకరాల మాగాణీ వుండేది. ప్రయోజకులైన ముగ్గురు కొడుకు లుండేవారు. కానీ అవేవీ అతని గొప్పతనానికి చిహ్నాలుకావు. ఆయన జ్యోతిష శాస్త్రజ్ఞానం, వాక్శుద్ధీ, ఆయన ప్రత్యేకతలు, తన పాండిత్యం యితరులకు తెలియకుండా వుంచాలని అతని ప్రయత్నం. కాని పువ్వు పరిమళం దాగనట్లు అతని కీర్తి చాలా వరకు వ్యాపిచింది. తెల్లార్లేస్తే ఎక్కడెక్కణ్నించో వచ్చేవారు జనం. "మా ఆవుపెయ్య కనిపించడం లేస్సార్?" "మా ఆడపిల్ల నల్లుడు తీసికెళ్ళడం లేస్సార్!" "మా అబ్బాయికి ఎం.బి.బి.యస్.లో సీటొస్తుందా సార్!" అని ఏవేవో అడుగుతూనే వుండేవారు.

ఒకనాడు, నేనత నింటికి వెళ్ళేసరికి, అతనెవరో జాతక చక్రం చూస్తున్నాడు. పక్కనే ఎవరో ముసలాయనా, ఒక కుర్రాడూ వున్నారు. ఆ అబ్బాయికి పాతికేళ్ళయినా వుండవు. మనిషి చురుకైన కళ్ళతో ఆకర్షణీయంగా, చూస్తే పలకరిం చాలనిపించేటట్టు న్నాడు. కళ్ళలోమాత్రం కాస్త నీరసం కనిపి స్తోంది. తనుపీలుస్తున్న ఊపిరి సరిపోయినట్టు, ఉండుండి బైటకు చప్పుడయినంత గట్టిగా ఊపిరి పీలుస్తున్నాడు. ముసలాయన మాత్రం జరీకోటూ, చమ్కీటోపీ మినహా పాతకాలపు రావు బహదూర్లా వున్నాడు. అతని బట్టతలమీద అక్కడా అక్కడా వున్న వెంట్రుకలు జలతారు వెంట్రుకల్లా మెరుస్తున్నాయి. అతని వళ్ళు తడిసిన బట్టల్లోంచి కనిపించినంతగా కనిపిస్తోంది. తను కట్టుకున్న సన్నబట్టల్లోంచి, మనిషి చూస్తే పండిన దబ్బపండులా వున్నాడు.

నన్ను పలకరించి, కూర్చోమని, మా మాఁవఁ మళ్ళీ జాతక చక్రం పరీక్షలో పడిపొయ్యేడు. కొంతసేపయ్యాక 'బంగార్లా చేర్చండి సేనిటోరియంలో, తొమ్మిది నెలలకల్లాపూర్ణారోగ్యంతో బైటకొచ్చేస్తాడు. వట్టి చేతుల్తో కాదు, పెళ్ళి కొడుకై మరీ వస్తాడు" అన్నాడు. అతనామాటలంటున్నప్పుడు, నేను ఆ ముసలాయన మొహంలో చూసిన రిలీఫూ, ఆ అబ్బాయి కళ్ళలోని ఆశా నా జన్మలో మరిచిపోలేను. తరువాత వాళ్ళు కృతజ్ఞతలు తెల్పి వెళ్ళిపోయేరు. మా మాఁవఁ వాళ్ళ సంగతంతా చెప్పేడు. వాళ్ళు తన పక్కింట్లో మూడేళ్ళయి వుంటున్నారుట. ఆ ముసలాయన కంట్రాక్టరుట. కొడుకు అంతగా చదువుకోలేదట. ఇప్పుడిప్పుడే తండ్రి దగ్గర వ్యాపారం నేర్చుకుంటున్నాట్ట. పాపం! అకస్మాత్తుగా ఈ మధ్యే టి.బి. వచ్చిందట. ఆ తండ్రి కొడుకులకి జ్యోతిష్యంలో పిచ్చి నమ్మక మట. చీటికీ, మాటికీ మా మాఁవని కన్సల్టుచేసి అతనిమాట రైటైనప్పుడల్లా ఎంతో పొంగిపోతారట.

ఆ తర్వాత, నేను నా తిరుగుడుద్యోగంలో పడిపోయి, వాళ్ళ సంగతే మరచిపోయేను. కాని కొన్నాళ్ళు పోయేక నేను వెళ్ళి నప్పుడు మామాఁవే జ్ఞాపకం చేశాడు, "ఇదివరకు నువ్వొచ్చి నప్పు డొచ్చేరు– పరంధామయ్యా, కొడుకూ గుర్తుందీ? పాపం! అతను పోయేడు"

"మరి నువ్వు బతుకున్నావ్" అనలేకుండా వుండలేక పోయేను.

"పోయింది కొడుక్కాదు, తండ్రి, కొడుక్కేం నిక్షేపంలా వున్నాడు. ఈమధ్యే సేనిటోరియంనుంచి తిరిగొచ్చేడు. గడియో, క్షణమో యిక్కడి కొస్తానని కబురుచేసేడు" అన్నాడు మా మాఁవ.

తర్వాత ఆ అబ్బాయొచ్చేడు. మనిషి ముగ్గుర్ని తన్నేటట్లు ఆరోగ్యంగా వున్నాడు. అతన్ని చూసి నేను పక్కగదిలోకి వెళ్ళిపోయినా, వాళ్ళమాటలు స్పష్టంగా వినిపిస్తూనే వున్నాయి. ఆ అబ్బాయి మాటలసారాంశం యిది. సేనిటోరియంలో ఎవరో నర్సు అతన్ని ప్రేమించిందట. అతనిక్కూడా ఆమె అంటే యిష్టమే నట. కాని తనజబ్బు ఎప్పటికేనా తిరగబెడుతుందే మోనని అతని భయమట. కాబట్టి ఆమెను కట్టుకుంటే, ఆమెకు మోసం చేసినట్టౌతుందట!" ఆమెకంటే తను యెక్కువ బతుకుతానన్న హామీ వుంటేనే ఆమెను చేసుకోదలిచేట్ట కాబట్టి యిద్దర్లో యెవరు ముందు పోతారో చూసి పెట్టమని యిద్దరి జాతకాలూ యిచ్చి అతను వెళ్ళిపోయాడు.

ఆ మధ్యాహ్నం నేన్నిద్దర్లేచే సరికి వాళ్ళ జాతకాలింకా చూస్తూనే వున్నాడు మా మాఁవ. తర్వాత పరీక్ష పూర్తిచేసి అతను తువ్వాల్తో కళ్ళజోడు తుడుచుకుంటూంటే "ఎలా వున్నాయ్ జాత కాలు?" అని అడగకపోయినా అడిగేసేను.

"ఏఁమిటో!" ఇద్దరిదీ మధ్య మాయుష్షులే. ఆవిడ రెండేళ్ళు దాటి బతకదు. ఇతగాడు ఆ తర్వాత మహావుంటే మరో ఏడాదో, ఏడ్పర్ధమో వుంటాడు" అన్నాడు మా మాఁవఁ తువ్వాల్తో మొహం తుడుచుకుంటూ.

నాకు సంబంధంలేని వాళ్ళవైనా రెండు నిండు ప్రాణాలు త్వరలో పోతాయంటే యెంతో కష్టమనిపించింది.

ఆ తర్వాత కొంతసేపటికి ఆ అబ్బాయొచ్చి తనే ఆ నర్సు కంటే ఎక్కువ కాలం బతుకుతాడన్న మా మాఁవఁ అభిప్రాయం తెలుసుకొని వెళ్ళిపోయేడు.

మరి కొన్నాళ్ళకి ఆ అబ్బాయి సంగతే మర్చిపోయేను ఇది జరిగిన కొన్ని సంవత్సరాలకి హైదరాబాదులో హోటలు హవాయిలో గార్డెనులో కూర్చున్నాను.

స్వర్గం నుండి ముక్కవిరిగి, భూమ్మీదకు జారిపోయి నట్టుందా హోటలు బిల్డింగు.

స్వర్గంలో పూసిన వింత పూవుల్లా వున్నాయి, గార్డెనులో అందంగా అమర్చిన ప్లాస్టిక్ కుర్చీలు.

ముట్టుకుంటే రంగంటుకుంటుందా అన్నంత నీలి నీళ్ళున్న స్విమ్మింగ్ పూలుంది పక్కనే.

ప్లాస్టిక్ దుస్తులు తొడిగిన అందమైన కొవ్వు బొమ్మల్లా వున్నారు దొరసానులు.

దేవనర్తకి కాలి మువ్వల చప్పుళ్ళా శ్రావ్యంగా వినిపిస్తోంది డాన్సింగు హాల్లోంచి సంగీతం.

కరగని మంచుముక్కల్లా వున్నాయి గార్డెనులో బ్లూలైట్లు. పన్నీటి జల్లులా మీద పడుతున్నాయి ఫౌంటెను తుంపర్లు.

అంత పెద్ద హోటల్లో బసచేసే తాహతు నాకులేదు. కాని ఆ హోటలు మేనేజరు నా స్నేహితు డవడంవల్ల ఆ హోటల్లోనే దిగుతా నెప్పుడూ. తాహతు మించిన పరిసరాలకు సరిపళ్ళేక, కొత్తపెళ్ళికూతుర్లా తలదించుకొని, ఒక టేబిలు దగ్గర కూల్ డ్రింక్స్ స్ట్రాతో గెలుకుతూ కూర్చున్నాను. గార్డెనులో చాలా టేబిల్స్ ఖాళీగానే వున్నాయి.

ఈలోగా, నా వెనక టేబిల్ దగ్గర కిల కిలనవ్వులూ, గ్లాసులో ద్రవం పోసిన చప్పుడూ విని వెనక్కి తిరిగిచూచేను.

ఎవరో యువకుడు మూడు గ్లాసుల్లో విస్కీ పోస్తున్నాడు. అందంగా, దర్జాగా, టిప్‌టాప్‌గా డిన్నర్ డ్రెస్సుతో వున్నాడు. కాస్త పెద్దసైజు పొరలు, తొడుకున్న అందమైన నాగుపాము పిల్లల్లా టైట్ డ్రెసెస్ తొడుక్కున్న యిద్దరు యువతులు, అతని కుర్చీ రెండు చేతులమీదా కూర్చున్నారు. అతను నన్ను చూడగానే ఆశ్చర్యంతో విస్కీసీసా టేబిల్ మీదుంచేసి "నేను గుర్తున్నానా" అంటూ దగ్గరకొచ్చాడు.

నిజం చెప్పాలంటే నాకు గుర్తులేదు. కాని ఆ మాటని, అతన్ని కష్టపెట్టడం యిష్టంలేకపోయింది. ఏమనాలో ఆలోచించే లోగా అతనే "నేనూ! పరంధామయ్యగారబ్బాయిని ఆనంద రావుని. మీ మావఁగారింటి పక్కనుండే వాళ్ళం. రండి, మా రూంకి వెళదాం" అంటూ లేచాడు.

తాగున్నాడు, రూంకితీసికెళ్ళి తంతాడేమోనని లోపల భయ మున్నా, సభ్యత కోసం అతనితో వెళ్ళకతప్పలేదు. గదిలోకి వెళ్ళాక తలుపు మూసేస్తూ 'ఇంకో ఏడాదిలో నేను చావడం తథ్యం" అన్నాడు నా వేపు గిర్రున తిరుగుతూ.

ఇంకో ఏడాదిలో నేనే చచ్చిపోతానని నాతో చెప్పినట్లయింది నాకు. ఆ తర్వాతంతా అతనే చెప్పాడు. ఆవేళ తనదీ, తన కాబోయే భార్యదీ ఆయుః ప్రమాణాలు మా మామనాతో చెప్తున్న ప్పుడు ప్రమాదవశాత్తు వీధరుగు మీదుండి అతను విన్నాట్ట. విన్నాక యింటికెళ్ళిపోయి ఏవీఁ తెలీనట్టు మళ్ళీ వచ్చేట్ట. మా దగ్గరికి. తనని ప్రేమించిన నర్సునే పెళ్ళి చేసుకున్నాట్ట. మా మావ చెప్పిన ప్రకారం ఆమె పెళ్ళయిన రెండేళ్ళకే చనిపోయిం దట. ఆమె పోయి దగ్గర దగ్గర ఏడాదైందట.

"అంచేత ఏం చేసే ననుకున్నారు? పెళ్ళాం పోయేక ఆస్తంతా కేష్ చేసేసేను. డెబ్బయివే లొచ్చింది. అప్పటికి నేను బతికేది మహా ఐతే రెండేళ్ళు. అంచేత మన ఆనందానికి నేను కేటాయిం చింది సంవత్సరానికి ముప్ఫైవేలు. నేను ఛస్తే గవర్నమెంటుకి మిగిలేది పదివేలు.

ఏం చెయ్యమంటారు? ఒంటరిగాడ్ని. నా అన్న వాళ్లెవరూ లేరు భూమ్మీద నూకలున్నన్నాళ్లూ హాయిగా బతికెయ్యడమే నా ప్లాన్. ఈ హోటల్లోనే మన మకాం" అంటూ నవ్వేడు.

అతని నవ్వులో బాధ అపశ్రుతిగా పలికింది. అతను తన మీద కప్పుకుంటున్న ఆనందపు తెరలు చింకివిగా కనిపించేయి నాకు.

ఇది జరిగి పదేళ్ళయిపోయింది రైల్లో ఈ ఆడమనిషి జ్యోతిష ప్రసంగం తెస్తే మళ్ళీ అతను గుర్తుకొచ్చేడు. ఈ లోగా హైదరా బాదు చేరేను. అతను గుర్తుకొచ్చి మనసు వికలమైపోయింది. ఎక్కడున్నాడో? ఏం చేస్తున్నాడో? అసలు బతికున్నాడో, లేదో? అతను బతకాలనిగాని, మరణించాలని గాని కోరుకోలేక పోయేను. అసలిలాంటి సంఘటనలే జరక్కూడదు.

మా స్నేహితుడు కారులో తన హోటలుకి తీసుకుపోయేడు. నన్నో టేబిలు దగ్గర కూర్చోపెట్టి డిన్నరు పంపుతానని చెప్పి వెళ్ళిపోయేడు.

తను చెరపట్టిన స్త్రీలను బంధించడానికి, ఎవరోరాక్షసుడు కట్టించిన మాయామహల్లా వుందా హోటలు.

భూమిలోంచి పుట్టుకొచ్చిన విషపు పువ్వుల్లా వున్నాయి గార్డెన్లో కుర్చీలు.

కుళ్ళు నీళ్ళల్లా నల్లగా వున్నాయి స్విమ్మింగ్ పూల్లో నీళ్ళు.

చర్మంలేని మాంసపు మనుషుల్లా వున్నారు అక్కడా అక్కడా వున్న దొరసాన్లు.

శ్మశానంలో ఈదురు గాలిలా, ఏడుస్తున్నాయి డాన్స్ హాల్‌లో వయొలినులు.

చనిపోయిన వాని కళ్ళల్లా నిర్జీవంగా వున్నాయి గార్డెన్లోని బ్లూలైట్లు.

బేరర్ ట్రే పట్టుకొచ్చి టేబిలుమీద సర్దడం ప్రారంభించాడు. పేపరు చదువుకుంటూ అతనివేపే చూళ్ళేదు నేను. అతను సర్దడం అయ్యేక పేపరుదించి అతన్ని చూశాను. అతన్ని చూడ గానే నా గుండె కొట్టుకొనే క్రమం ఒక్కసారి తప్పింది. అతను నన్ను చూసి పోల్చుకున్నట్టు కనుబొమ్మలెగరేసి, మళ్ళా బెస్ట్ బేరర్ మేనర్స్‌తో ఏమీ తెలీనట్టు వెళ్ళిపోయేడు.

అతనే ఆనందరావు.

**(జ్యోతి, దీపావళి 10.11.1966)**